**ఈ వారం కథ!**

# అడవి కేక

**రావుల పాటి సీతారామారావు**



ఆ కొండ మీది నుంచి చూస్తే చుట్టూరా అలుముకున్న అడవి దట్టంగా కనపడుతున్నది.

అంత దట్టమైన అడవిని జీవితంలో మొదటిసారి– రెండు రోజుల క్రితమే చూసాడు డాక్టర్ వాసు!

పైలా పచ్చీసుగా డాక్టర్ కోర్సును ముగించుకున్న వాసుకు అనుకోకుండా ట్రైబల్ ఏరియాలో ఉద్యోగం వచ్చింది. విదేశాలకు వెళ్ళాలనే ప్రయత్నంలో వున్న అతడికి ఆ ఉద్యోగం చాలా థ్రిల్లింగ్‌గా అనిపించి వారం రోజుల క్రిందటే చేరాడు. ఏడాది క్రిందట ప్రేమించి పెళ్ళి చేసుకున్న రాధ ఎగిరి గంతేసి ఆ పల్లెటూరికి అతని వెంట వచ్చింది.

ప్రైమరీ హెల్త్ సెంటర్ ఉద్యోగం అనుకున్నంత థ్రిల్లింగ్‌గా వుండదని చేరిన మూడు రోజుల్లోనే తెలిసింది! అతను నిరాశ పడకుండా– చిత్రంగా– జీవితంలో అనుకోని థ్రిల్ వాసుకు రెండు రోజుల క్రింద ఎదురయింది!

ఆ సాయంత్రం ఇంకా చీకటి పడలేదు. వాసు వుంటున్న ఊరు– అడవి ప్రక్కనే! హెల్త్ సెంటర్ నుంచి నడుస్తూ కులాసాగా అడవి లోపలికి వెళ్ళాడు. ప్రకృతి అంత అద్భుతంగా వుంటుందని మొదటిసారి తెలియవచ్చింది.

కీచురుమంటున్న వాతావరణంలో పక్షులు సంగీతాన్ని అందిస్తున్నాయి. పూల వింతవాసన ప్రాణానికి మత్తెక్కిస్తున్నది.

వాసు సౌందర్యోపాసనలో పడిపోయినప్పుడు వినిపించింది ఆ స్వరం– "మీ పేరు" అన్న మాటతో

అడవిలో అకస్మాత్తుగా పేరు అడగడం అతను ఊహించలేదు. ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూశాడు.

ముగ్గురు ఆలివ్ గ్రీన్ డ్రెస్‌లో తుపాకులతో వున్నారు. ఆ ముగ్గురిలో ఒకరు స్త్రీ.

వాసుకు గుండె గుభిల్లుమంది. కానీ– గమ్మత్తుగాకూడా అనిపించింది. అడవుల్లో 'వాళ్ళు' వుంటారని విన్నాడు కానీ– ఇంత తొందరగా వాళ్ళను కలిసే అనుభవం ఎదురవుతుందని అనుకోలేదు!

ధైర్యంగానే చెప్పాడు– "డాక్టర్ వాసు" అని– డాక్టర్ పదాన్ని వత్తి పలుకుతూ!

వాళ్ళు ముగ్గురూ ఒకరి నొకరు చూసుకున్నారు. ఒక క్షణంలోనే నిర్ణయం తీసుకున్నట్లుంది–

"మీరేం భయపడనవసరం లేదు– పదండి మా వెంబడి" అన్నాడు వాళ్ళలో ఒకాయన– అతను వాళ్ళకు నాయకుడు అని వేరే చెప్పాల్సిన అవసరం కూడా కనపడలేదు! అతని మాటా– తీరూ అంతా నాయకుడి స్వరూపాన్ని తెలియపరుస్తూనే వుంది!

"నేనెందుకూ?" ఆశ్చర్యంగా అడిగాడు వాసు.

ఆ నాయకుడు నవ్వాడు.

"నన్ను చిన్నా అని పిలవొచ్చు. మాకు చాలా ముఖ్యమైన వాడ్ని ప్రభుత్వం పట్టుకుంది. అతన్ని విడిపించుకోటానికి మిమ్మల్ని ఉపయోగించుకుంటాం" నెమ్మదిగా చెప్పాడు తుపాకిని ఇంకో చేతిలోకి మార్చుకుంటూ!

వాసుకు గుండె గుభిల్లుమంది. "నన్ను... నన్ను కిడ్నాప్ చేస్తున్నారా?" అతి కష్టం మీద అడిగాడు.


ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 11-6-93

"అవును" అంతే నెమ్మదిగా చెప్పాడు చిన్నా!

అలా రెండు రోజుల క్రితం మొదలయింది వాసుకు అడవిలోని అందాలు చూడడం!

రెండోరోజు ఉదయం ప్రాంతీయ వార్తలు వాళ్ళు ముగ్గురూ ఉగ్గబట్టుకొని వింటుంటే అతనూ ఆసక్తితో విన్నాడు. అప్పడు తెలుసుకున్నాడు- వాళ్ళ డిమాండ్‌ను ఒప్పకోకుండానే- మానవతా దృక్పథంతోటి తనను వదిలేయమని అప్పీలు చేశారనీ, తన భార్య రాధ కిడ్నాప్ సంగతి తెలియగానే స్పృహ తప్పిందనీ!

మొదట వాసు కేమీ అనిపించలేదు- అంత ప్రాముఖ్యత లభించటం కూడా గర్వాన్ని కలిగించింది. 'థ్రిల్' ఏదో కష్టపడితే లభిస్తుందనుకున్నాడు- కానీ తన ప్రమేయం లేకుండానే ఆ అనుభూతి అయాచితంగా దొరకటం వింతగా తోచింది!

ఆ మధ్యాహ్నం గూడా వాళ్ళు 'వార్తలు' విన్నారు. వాళ్ళ మొహాల్లో కోపం కనపడింది. అతని పట్ల ఆదరణ కొంచెం సన్నగిల్లింది. వాసు భయపడడం అప్పడు మొదలయింది. అడవిలో సౌందర్యంతో పాటు వణుకును కూడా అతను తెలుసుకోగల్గాడు.

"రేపు ఉదయం లోపల మా వాడ్ని విడిచిపెట్టకపోతే నిన్ను చంపేయక తప్పదు" – చిన్నా మామూలుగానే చెప్పాడు.

వాసుకు వళ్ళు గగుర్పొడిచింది. ఏమిటి- చావు తనకు అంత సన్నిహితంగా వుందా?- అతను ఆలోచన మానుకున్నాడు!

ఆ మధ్యాహ్నం వాళ్ళు పెట్టిన భోజనం సహించలేదు. ఆ సాయంకాలం వాళ్ళు వార్తలు వింటున్నప్పడు కావాలనే అతను వినలేదు. ఉద్వేగం అతి కష్టం మీద అణుచుకున్నాడు. వాళ్ళ మొహాల్లో ఈ సారి క్రోధం కనపడింది! అతని పట్ల చిరాకు గూడా కొట్టొచ్చినట్లు కనపడింది.

క్రితం రాత్రి వాసు చలిలో వణుకుతున్నప్పడు చిన్నా ఎంతో ఆదరంతో ఇంకో రగ్గు కూడా ఇచ్చాడు కప్పకోటానికి!

ఈ రాత్రి వాసు వణుకును అతి కష్టం మీద అణుచుకోటానికి ప్రయత్నిస్తున్నాడు. వాళ్ళలో వాళ్ళు ఏదో గుసగుసలు ఎడతెరిపి లేకుండా పెట్టుకుంటూనే వున్నారు-

నిద్ర పట్టలేదు. దోమలు కుడ్తుంటే అనిపించింది- తెల్లవారింతరువాత- ప్రాణమే పోతున్నప్పడు దోమలను గురించి బాధపడడం ఎందుకని?!

వాళ్ళు వొంతులవారీగా నిద్ర లేవగానే ట్రాన్సిస్టర్ పెట్టారు-

వాసు తెల్లవార్లూ అలాగే వున్నాడు- ప్రక్కనే మెలుకువతో వున్న సెంట్రీనీ- తుపాకీనీ- దట్టంగా వున్న అడవినీ, అంతుపట్టని భవిష్యత్తునూ చూస్తూ!

ఆ ఉదయం వార్తలు వినగానే- వాళ్ళకు ఆ నిర్ణయం తీసుకోక తప్పలేదు. "సారీ- మీరు చావక తప్పదు! మమ్మల్ని తేలిగ్గా తీసుకున్నందుకు వాళ్ళు ఫలితం అనుభవించక తప్పదు!" – చిన్నా దృఢంగా చెప్పాడు.

అటూ ఇటూ తీసుకొనే నిర్ణయాలకు తను ఫలితం ఎందుకు అనుభవించాలో- పండంటి జీవితాన్ని ఎందుకు వదులుకోవాలో వాసుకు ఎంతకూ అర్థం కాలేదు! వాళ్ళను బ్రతిమాలేందుకు కూడా ధైర్యం చాలటం లేదు. ఆ మూడు రోజుల నుంచీ అనుభవించిన ఉత్కంఠకు ప్రాణం పోతేనే బాగన్న ఆలోచన ఎందుకో వచ్చింది!

వాళ్ళు- వాసును కొండ మీది నుంచి దింపుతున్నప్పడు అనుకోకుండా ఆ సంఘటన జరిగింది. ముందు నడుస్తున్న చిన్నా- అకస్మాత్తుగా కుప్పలా కూలిపోయాడు. మిగతా ఇద్దరూ- ముఖ్యంగా ఆమె కంగారుపడింది. అలవాటు చొప్పన వాసు చిన్నాను పరీక్షించాడు. అతనికి అర్థమయింది ఆ జబ్బేమిటో! అర్జెంటుగా ఆ మందు లేకపోతే చిన్నా బ్రతకటం కష్టం!

చిన్నాను బ్రతికించటం కోసం- వాసు చావు ప్రస్తుతానికి వాయిదా పడింది. కొండ క్రిందనే అటు వైపు రెండు మూడు మందుల షావులున్న వూరు వుంది. ఏ మందు కావాలో రాసిచ్చాడు. ఆమెను వాసుకు కాపలాగా వదిలేసి- వాళ్ళలో మిగిలిన అతను ఆఘమేఘాల మీద పరుగెత్తుకుంటూ వెళ్ళాడు.

ఆమె చిన్నా గుండె రాస్తూ- ఏడుస్తూ వుంది. కావాలనుకుంటే వాసు అక్కడి నుంచి తప్పించుకోవచ్చు. కానీ ఎందుకో పోబుద్ధి కాలేదు. ఆమెను- దీనంగా ఏడుస్తున్న ఆమెను – ఆ పరిస్థితుల్లో వదిలేసి పోవాలనిపించలేదు. నిమిషమొక యుగంగా – ఆమెకు గడిచి వుండొచ్చు!

ఎంత వేగంగా వెళ్ళాడో- అంత వేగంగా తిరిగి వచ్చాడు అతను ఆ మందు తోటి! ఆమె కళ్ళు వెలుగులు విరజిమ్మాయి. నీళ్ళలో ఆ మందును కలిపి అతి కష్టం మీద త్రాగించారు. చిన్నా బ్రతుకుతాడో- లేదో అనే వాళ్ళిద్దరి ఆదుర్దా! వాసు ఉనికిని కూడా గమనించే స్థితిలో లేరు! ఆమె ప్రార్థించిందో లేదో తెలియదు కానీ- ఆమె కోరిక ఫలించింది. చిన్నా లేచి కూర్చున్నాడు! చిన్నా వాసు తెప్పించిన మందుతో బ్రతికాడు!

వాళ్ళు ముగ్గురూ వాసును కృతజ్ఞతతో చూశారు. వాసుకు అర్థం అయింది- వాళ్ళు అతన్ని వదిలేయటానికి నిశ్చయించుకున్నారని!

అనుకోకుండా ప్రాణదానం లాంటిది చేసిన అతని ప్రాణాన్ని తీసుకోవటం వాళ్ళకు అసాధ్యం!

కొండ దిగుతూ అలవాటు చొప్పన వాళ్ళు రేడియో పెట్టారు. యథా ప్రకారం మానవతా దృక్పథంతో డాక్టర్ వాసును వదిలేయమని వార్తల్లో వినపడుతున్నది- అటు తర్వాత చెప్పిన వార్తే వాళ్ళనూ- వాసునూ నిశ్చేష్టుల్ని చేసింది!

"కిడ్నాప్ వార్త వినటంతో అపస్మారక స్థితిలోకి పోయిన డాక్టర్ వాసు భార్య రాధ ఈ సాయంత్రం నాలుగు గంటలకు మరణించింది"- అదీ ఆ వార్త!

అంత దట్టమైన అడవీ మానవత్వాన్ని నిర్వచించలేక కెవ్వున కేకేసింది! ●

## ద్వేష సంగీతం – 'సి' మేజర్‌లోంచి 'సి' మైనర్‌లోకి అసంబద్ధ అధివాస్తవిక స్వగతంలో

పక్షులెటూ ఎగిరిపోతున్నయ్
చెట్టున్నా విట్టార్చుతూ
అరణ్యానికి అరణ్యాన్నే తగలబెట్టు
ఆనమాలు పట్టకుండా
ఎవడన్నా ఇటువేపొస్తోంటే
ఇంట్లో చెప్పే వచ్చావాని చంపేయ్
మంచి సంగీత సభల్లో
లెంపలు వాయించే పోటీ పెట్టు
గుహాంతర్భాగ చిత్రాల్లోని
పారిపోతున్న జింకను వొండుకుతిను
యుద్ధ ప్రకంపనాల్లో దేశ
దేశాల మాతృభూమి ప్రేమల్ని భస్మం చేసేయ్
మొఖ్జార్ట్ సొనెట్టాలో
చీకటి కోడిగుడ్డు తెల్లసొన తీవలులాగు

– 'మో'